వెలవెలబోయిన ఫుడ్ ఫెస్టివల్

ఓ పక్క వర్షం... మరోపక్క అధిక రేట్లు...

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: గత రెండు రోజుల క్రితం బీచ్ రోడ్డు ఎంజీఎం పార్క్ రోడ్‌లో ప్రారంభమైన ఫుడ్ ఫెస్టివల్‌లో అధిక ధరలతో సందర్శకులు బెంబేలెత్తిపోయారు. ఏ వస్తువు తినాలన్నా కనీసం వంద రూపాయలకు తక్కువ లేకపోవడంతో అనేకమంది వామ్మో ధరలు అంటూ, వెనుతిరిగి పోయారు. ఆఖరి రోజు ఆదివారం సాయంత్రం అధిక జనాల తాకిడి ఉన్నప్పటికీ వర్షం ఓపక్క సందర్శకుల్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. తీరా స్టాల్స్‌కి వెళ్లి ఫుడ్ ఆర్డర్ చేస్తే ధరలు దడ పుట్టించాయి. ప్రభుత్వం నగరంలోని అన్ని వ్యాపార సంస్థలతోపాటు రాష్ట్రం అనేక ప్రాంతాల నుండి వివిధ రకాల రుచులను ఒకే చోట ఏర్పాటు చేసి ఫుడ్ ఫెస్టివల్‌ను ఏర్పాటు చేసింది. దీనిని మంత్రి బాల వీరాంజనేయ స్వామి ప్రారంభించారు. అయితే సరసమైన ధరలకు లేకపోవడంతో అనేకమంది ఆందోళన వ్యక్తం చేశారు. అనేక హోటల్ వ్యాపారులకు లబ్ధి చేకూరేలా అధిక ధరలకు ఈ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించడంపై తీవ్ర విమర్శలు వెలువెత్తుతున్నాయి. ప్రభుత్వం ఉచితంగా స్థలం ఇచ్చినప్పటికీ, వ్యాపార సంస్థలు మాత్రం అధిక ధరలకు ఫుడ్ ఫెస్టివల్ పెట్టడం తీవ్ర అసంతృప్తి వ్యక్తం అయింది. నూడిల్స్ నుంచి వాటర్ బాటిల్ వరకు అన్ని 100% ధరలు అధికంగానే కనిపించాయి. వారాంతపు సెలవు కావడంతో ఆదివారం కుటుంబ సమేతంగా వెళ్లిన వారికి జేబి చిల్లు పడింది. వామ్మో ఇదేం ఫెస్టివల్ అంటూ అనేకమంది వెంటనే వెనుదిరిగారు.

లులూ మాల్‌కి కేటాయించిన భూములు వెనక్కి తీసుకోవాలి

బీచ్ రోడ్డులో విశాఖ ప్రజా వనరుల పరిరక్షణ వేదిక డిమాండ్

విశాలాంధ్ర - విశాఖ : లులూ మాల్‌కి కేటాయించిన స్థలాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని విశాఖ ప్రజా వనరుల పరిరక్షణ వేదిక డిమాండ్ చేసింది. లులూ మాల్‌కి బీచ్ రోడ్డులో స్థలం కేటాయించడానికి వ్యతిరేకిస్తూ బీచ్ రోడ్డులోని పార్క్ హోటల్ వద్ద ఆదివారం సాయంత్రం కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రజలకు అవగాహన కల్పించారు. వేదిక కన్వీనర్ డాక్టర్ సీఎస్ క్షేత్ర పాల్, ఎస్. వెంకటలక్ష్మి మాట్లాడుతూ విశాఖలో లులూ మాల్‌కి కేటాయించిన స్థలంలో సైన్స్ సిటీ నిర్మించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ప్రభుత్వ స్థలాలను తక్కువ ధరకు కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతోందని విమర్శించారు. ఇలా అయితే భవిష్యత్తులో విశాఖలో ప్రభుత్వ స్థలాలు ఉండవని అన్నారు. బీచ్ రోడ్డులో విలువైన స్థలాన్ని లులూ మాల్ కి కేటాయించడం వల్ల ప్రజలకు ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. ఈ కార్యక్రమంలో వేదిక నాయకులు రవి, అచ్యుతరావు, బాలనాగమ్మ, బి. రామకృష్ణ, బి.పుష్పలత, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లలోకి మురికి నీరు

వర్షం పడితే అంతే సంగతి..!

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధిలోని 58వ వార్డ్ ములగాడ లోతట్టు ప్రాంతం వర్షం పడితే ఇళ్లల్లోకి మురికి నీరు చేరి గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల చిన్నపాటి వర్షాలకే కల్వర్టులలోని వ్యర్థాలు దిగువకు వెళ్లపోవడంతో కల్వర్టులు పొంగి తమ ఇళ్లలోకి వ్యర్థనీరు చేరుతుందని దీనిపై పలుమార్లు అధికారులకు తెలిపినప్పటికీ అప్పటికప్పుడు తాత్కాలిక పనులు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారని దీనిపై శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు. కల్వర్టులోని పూడికలు త్వరితగతిన తొలగించాలని కల్వర్టు మరమ్మతులు చేపట్టాలని తమ గ్రామం ముంపు బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని అటు అధికారులు ప్రజా ప్రతినిధులను కోరుతున్నారు. ఇప్పటికే ములగాడ నుండి మారుతి సర్కిల్ వరకు ఉన్న మార్గం బురదమయంగా మారి అటు వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వర్షం పడితే ఈ మార్గం వెంట ప్రయాణాలు అత్యంత ప్రమాదకరంగా మారుతున్నాయని వాపోయారు. తక్షణమే తమ సమస్యలు పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆయుర్వేద వైద్య విద్యలో స్టేట్ టాపర్‌గా సాయి శ్రీనిజ

విశాలాంధ్ర - ఆనందపురం: వేములవలసలోని సత్య కళ్యాణ్ అపార్ట్మెంట్స్‌లో నివాసం ఉంటున్న కొండవీటి సాయి శ్రీనిజ 2023 - 24 సంవత్సరమునకు డాక్టర్ ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం నిర్వహించిన బ్యాచలర్ ఆఫ్ ఆయుర్వేదిక్ మెడిసిన్ అండ్ సర్జరీ కోర్సులో రాష్ట్రంలో అత్యధిక మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచినట్లు అంతేకాక రెండు సబ్జెక్టుల్లో స్టేట్ టాపర్ గాను విజయవాడలోని డాక్టర్ నోరి రామశాస్త్రి ఆయుర్వేదిక్ కళాశాల బెస్ట్ అవుట్ గోయింగ్ స్టూడెంట్‌గా ఎంపికైనట్లుగా డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ ప్రకటించినట్లు తండ్రి శంకర సాయి శర్మ తెలిపారు. ఈనెల 9వ తేదీన విజయవాడలో జరిగే యూనివర్సిటీ స్నాతకోత్సవ సభలో మూడు గోల్డ్, ఒక సిల్వర్ మొత్తంగా 4 మెడల్స్ సాధించటం సంతోషకరంగా ఉందని తెలిపారు. సాయి శ్రీనిజ తల్లిదండ్రులు రాజరాజేశ్వరి, శంకర్ సాయి శర్మ భీమిలిలోని కేథరిన్ విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు.

గణేష్ నిమజ్జనాల వద్ద సీపీ పర్యవేక్షణ

విశాలాంధ్ర - విశాఖ క్రైమ్: నగరంలో గణేష్ నిమజ్జనాలు ప్రశాంతంగా జరిగేందుకు సీపీ శంఖబ్రత బాగ్చి పటిష్ట చర్యలు తీసుకున్నారు. భీమిలి, ఐటీ సెజ్, సాగర్ నగర్, జోడుగుల్ల పాలెం, అప్పుఘర్, కోస్టల్ బ్యాటరీ, ఇతర ప్రాంతాలను స్వయంగా వెళ్ళి పరిశీలించారు. నగరంలో నిమజ్జనం జరుగుతున్న ప్రాంతాలను సందర్శిస్తూ, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, నిమజ్జనాలు ప్రశాంతంగా జరిగేలా, స్వయంగా దగ్గరుండి పర్యవేక్షించారు. నిమజ్జన అనంతరం ప్రజలు భద్రంగా తిరుగు పయనమయ్యేలా తగు బందోబస్తు ఆయా ప్రాంతాలలో ఏర్పాటు చేసి, సంబంధిత అధికారుల విధులను స్వయంగా పర్యవేక్షించారు.

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే పంచకర్ల

విశాలాంధ్ర - పెందుర్తి: పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు మానవత్వం ప్రదర్శించారు. పెందుర్తి నియోజకవర్గంలో పలు కార్యక్రమాల్లో పాల్గొని తిరిగి సిటీలో వేరే కార్యక్రమానికి వెళ్తున్న ఎమ్మెల్యే మార్గం మధ్యలో శొంఠ్యాం నుండి అడవివరం రోడ్డులో ఎస్ఆర్ పురం కాలనీ వద్ద ద్విచక్ర వాహనంపై వెళుతూ ప్రమాదానికి గురైన వృద్ధురాలిని చూసారు. వెంటనే స్పందించి తాను ప్రయాణిస్తున్న కాన్వాయ్ వాహనాన్ని పక్కకు నిలిపి ఆమె వద్దకు వెళ్లి తన సహచరులతో ఆమెకు మంచినీరు త్రాగించి వెంటనే స్థానిక సింహాచలం ఆసుపత్రికి ఫోన్ ద్వారా సమాచారం అందించి ఆ వృద్ధురాలిని తరలించి మెరుగైన వైద్యం అందించాల్సిందిగా ఆదేశించారు. ఈ విషయంపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

తప్పిన పెను ప్రమాదం

హెచ్‌పీసీఎల్‌లో మంటలు ఆర్పివేసిన అగ్నిమాపక సిబ్బంది

విశాలాంధ్ర - మల్కాపురం : హెచ్‌పీసీఎల్‌లో అకస్మాత్తుగా మంటలు ఒక్కసారిగా ఆందోళన కలిగించాయి. నగరంలో ఆదివారం వర్షం కురిసింది. ఈ క్రమంలో ఈస్ట్ఇండియా పెట్రోలియం కంపెనీపై పిడుగు పడింది. కంపెనీలోని పెట్రోల్ ఫిల్టర్ ట్యాంక్‌పై పిడుగు పడటంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, ఘటనాస్థలికి చేరుకొని మంటలు ఆర్పివేశారు. విశాఖలో అగ్నిప్రమాద ఘటనపై హోం మంత్రి అనిత స్పందించారు. అగ్నిమాపకశాఖ అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం మంటలు అదుపులోకి వచ్చాయని, ప్రజలు భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొనసాగుతోందన్నారు. మొత్తానికి పెను ప్రమాదం తప్పింది.

వైద్య విద్య దూరం చేసే పీపీపీ విధానం రద్దు చేయండి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పీపీపీ పద్ధతిలోకి మార్చడం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు వైద్య విద్య దూరం చేయడమేనని తక్షణమే పీపీపీని రద్దు చేయాలని విదసం (విస్తృత దళిత సంఘాల) ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు డిమాండు చేసారు. ఆదివారం విశాఖ అంబేద్కర్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో వెంకటరావు మాట్లాడుతూ రాష్ట్రంలో వైద్య విద్యపై ఇటీవల మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం ద్వారా మెడికల్ సీట్ల రిజర్వేషన్లలో 50 శాతం కోత విధించారన్నారు. రాష్ట్రంలో కొత్తగా 2400 సీట్లు అందుబాటులోకి రాగా పీపీపీ వల్ల 1200 సీట్లు మాత్రమే కన్వీనర్ కోటా కిందకు వస్తాయని, మిగిలిన సీట్లన్నీ ప్రైవేటు యాజమాన్యం కోట్ల రూపాయలకు అమ్ముకునే సౌకర్యం ప్రభుత్వ కల్పించిందని ఇది కూటమి సర్కారు ప్రైవేటు వారికోసం పెట్టిన మెడికల్ సీట్ల దోపిడి పథకం అని విమర్శించారు. కేంద్రం అనుమతించిన ఫ్రీ మెడికల్ సీట్లను రాష్ట్రం ప్రైవేటు వారికి ధారాదత్తం చేస్తుందన్నారు. జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సెల్ఫ్ ఫైనాన్స్ సీట్ల రద్దు చేస్తామని ప్రకటించిన కూటమి నేడు అంతకంటే ప్రమాదకరమైన పద్ధతిలో మొత్తం 17 మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించి రిజర్వేషన్ కోటాను సగానికి కోత విధించడం ధర్మమేనా అని వెంకటరావు ప్రశ్నించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఉచిత సీట్లకు అర్హత కలిగిన తెల్ల కార్డులు లేని ఎస్సీ, ఎస్టీ, బీసీలతో పాటు అన్ని వర్గాల వారూ పీపీపీలో కన్వీనర్ సీట్లకు 12 నుండి 15 లక్షలు చెల్లించాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. జాజి ఓంకార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సోడదాసి సుధాకర్, బూల భాస్కరరావు, గుడివాడ ప్రసాద్, కే.మల్లేష్, వీర బాబు, ఉమా మహేశ్వరి, రవి శేఖర్, సిహెచ్ నాగేశ్వర్‌రావు, రాము, సామ్యూల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పన కోసం ఒత్తిడి తెస్తాం

సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కసిరెడ్డి

విశాలాంధ్ర - గాజువాక : జీవీఎంసీ 88వ వార్డు టిడ్కో గృహాలకు మౌలిక సదుపాయాల కల్పన కోసం అధికారులపై ఒత్తిడి తెస్తామని సీపీఐ విశాఖ జిల్లా సహాయ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ స్పష్టం చేశారు. ఆదివారం టిడ్కో హౌసింగ్ ప్రాజెక్ట్ సముదాయంలో టిడ్కో గృహ లబ్ధి దారుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ టిడ్కో గృహాలు నిర్మించి పదేళ్లు గడుస్తున్నా మౌలిక సౌకర్యాలు కల్పించి లబ్ధిదారులకు గృహాలను కేటాయించక పోవడం దారుణమన్నారు. ప్రభుత్వాలు మారినప్పటికీ టిడ్కో గృహాలను ఇప్పటి వరకు కేటాయించక పోవడం ప్రభుత్వాల నిర్లక్ష్య ధోరణికి నిదర్శన మన్నారు. టిడ్కో గృహాలకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నామని అన్నారు. తక్షణమే టిడ్కో గృహాలకు మౌలిక సౌకర్యాలు కల్పించి లబ్ధిదారులకు కేటాయించాలని సిపిఐ డిమాండ్ చేస్తున్నదని అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు జి.ఆనంద్, నాయకులు అప్పారి విష్ణు మూర్తి, టిడ్కో గృహ లబ్ధిదారులు ఏ.గోపి, మల్లేశ్వరరావు, తిరుపతిరావు పాల్గొన్నారు.

రహదారి విస్తరణ పేరుతో కూల్చివేతలు అన్యాయం

భీమిలి వైసిపి ఇన్చార్జి మజ్జి శ్రీనివాసరావు

విశాలాంధ్ర- పీఎం పాలెం: రేవళ్లపాలెం రహదారి విస్తరణ పనులు పేరుతో జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు వైసిపి నేతల ఇల్లు కూల్చివేతలకు పాల్పడడం అన్యాయమని విజయనగరం జడ్పీ చైర్మన్, భీమిలి వైసిపి ఇన్‌చార్జి మజ్జి శ్రీనివాసరావు అభిప్రాయపడ్డారు. మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతరావు భవనాన్ని పాక్షికంగా కూల్చివేతకు పాల్పడిన ప్రాంతాన్ని ఆయన ఆదివారం పరిశీలించారు. కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ అధికారులు లెక్కచేయకుండా కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారని ఆరోపించారు. ప్రభుత్వం అభివృద్ధి పేరుతో ప్రతిపక్ష నేతల ఇళ్లను ఆస్తులను ధ్వంసం చేసేందుకు టార్గెట్ చేస్తుందని మండిపడ్డారు. ఈ సందర్భంగా హనుమంతరావును వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఆసుపత్రి అభివృద్ధి కమిటి ఏర్పాటు

విశాలాంధ్ర - పెదగంట్యాడ: రాష్ట్ర టీ.డి.పి అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ఆదేశాలు మేరకు పెదగంట్యాడ ప్రాదమిక ఆరోగ్యకేంద్రం ఆసుపత్రి అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేశారు. ఛైర్మెన్ పులి లక్ష్మీబాయి, కన్వీనర్‌గా డాక్టర్ సంపత్ బాబు, మెంబర్లుగా డిప్యూటి మేయర్ దల్లి గోవిందరెడ్డి, 76వ వార్డు కార్పొరేటర్ గంథం శ్రీనివాసరావు, గాజువాక జోనల్ కమిషనర్ శేషాద్రి, తహసీల్దార్ అమల, వైద్యాధికారి డాక్టర్ హేమలతలను నియమించారు. చైర్మన్ పులి లక్ష్మీబాయి మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధి దిశగా ముందుకు తీసుకు వెళ్లేందుకుఅవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో తనకాల సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంటు శివప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

మేఘాద్రి గెడ్డలో ఇద్దరు యువకులు గల్లంతు

విశాలాంధ్ర - పెందుర్తి: విశాఖ జిల్లా పెందుర్తి మండలం మెఘాద్రిగేడ్డ రిజర్వాయర్లో చేపల వేటకు దిగి ఇద్దరు యువకులు గల్లంతయ్యారు. చినముషిడివాడకు ఆక్సిజన్ కాలనీకి చెందిన ఎడాడ లక్ష్మణ్ కుమార్ (18), జేఎన్ఎంఆర్‌యు కాలనీకి చెందిన బల్లంకి శేఖర్ (18) మేఘాద్రి గెడ్డలో చేపల వేటకు దిగి కొట్టుకుపోయారు. సమాచారం తెలుసుకున్న పెందుర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ సతీష్ కుమార్ తక్షణమే స్పందించి గజ ఈతగాళ్లను రప్పించి యువకుల కోసం ముమ్మర గలింపు చేపట్టారు. చెరువులో నుండి ఇద్దరు మృతదేహాలను బయటకు తీశారు. దీనిపై పెందుర్తి పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాల్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కి తరలించారు.

కూటమి సర్కారులో రజకులకు బోలెడు ప్రయోజనాలు

- రజకుల ఆకాంక్ష సభలో రాష్ట్ర మంత్రులు పార్థసారధి, సత్యకుమార్, కొల్లు రవీంద్ర

విశాలాంధ్ర - విశాఖ సిటీ: కూటమి సర్కారులో రజకులకు సామాజిక, ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలు కలుగుతాయని రాష్ట్ర మంత్రులు పార్థసారధి, సత్య కుమార్, కొల్లు రవీంద్రలు పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు అధ్యక్షతన వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో ఆదివారం జరిగిన రజకుల ఆకాంక్ష సభ-ప్రభుత్వ పథకాల అవగాహన కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. రజకుల సంక్షేమానికి, అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న సహకారం గురించి వివరించారు. రజకులకు అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా నిలుస్తుందని, తమవంతు సాయం అందిస్తామని ఉద్ఘాటించారు. రజకులకు ఐక్యత అవసరమని, ప్రభుత్వం వారి కోసం తీసుకొచ్చే జీవో లను అడిగి మరీ అమలు చేయించుకోవాలని సూచించారు. రజకులను ఎస్సీల్లో చేర్చే తీర్మానం టీడీపీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. బలహీన వర్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక పథకాలను ముందుకు తెచ్చిందని చెప్పారు. దువ్వారపు రామారావు నిరంతరం బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని కొనియాడారు. మోస్ట్ బ్యాకవర్డ్ కాస్ట్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయడంలో రామారావు కీలక పాత్ర పోషిం చారని చెప్పారు.రజకులకు ఆదరణ పథకం ద్వారా పనిముట్లు, కమ్యూనిటీ హాల్స్, దోబీ ఘాట్లు అందిం చడం వల్ల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని చెప్పారు. కూటమి ప్రభుత్వం మీకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని, మీ సమస్యల పరిష్కారంలో ఎప్పుడూ ముందుంటుంది అని భరోసా ఇచ్చారు. ఆకాంక్ష సభలో మంత్రులతో పాటు భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, శాసనమండలి విప్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు, ఏపీ రజక సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్పర్సన్ సి.సావిత్రి, స్థానిక ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్ బాబు, విష్ణుకుమార్ రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు, ఏపీ గ్రోవర్స్ అండ్ ఆయిల్స్ సీడ్స్ కార్పొరేషన్ ఛైర్మన్ గండిబాబ్జీ, డీసీసీబీ ఛైర్మన్ కోన తాతారావు తదితరులు భాగస్వామ్యమయ్యారు.

శిథిలావస్థలో పాఠశాల భవనం

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం బంటుపల్లి గ్రామపంచాయతీలో ఉన్న వేములవలస ఎఫ్‌హెచ్ పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థలో ఉంది. ఎప్పుడు ఏం జరుగుతుందో అన్నట్లు పాఠశాల భవనం పరిస్థితి ఉంది. సుమారు 40 మంది విద్యార్థులు 4గురు ఉపాధ్యాయులు విద్యని అభ్యసిస్తున్నప్పటికీ భవనం పాతది కావడంతో రోజురోజుకీ పరిస్థితి దారుణంగా ఉందని చెబుతున్నారు. గతంలో పాఠశాల భవనానికి నిధులు మంజూరు అయినప్పటికీ పూర్తిస్థాయిలో వినియోగించలేదని, అలా వినియోగించినట్లయితే కొంతమేర పనులు జరిగేవని, ఇక్కడ విద్యార్థులకు మరుగుదొడ్లు పరిస్థితి కూడా చాలా దారుణంగా ఉందని, తరచూ విద్యార్థులు దృష్ట్యా సమస్యను పరిష్కారం చేసి విద్యాశాఖ అధికారులు చొరవ తీసుకొని శిథిలావస్థలో ఉన్న పాడుబడ్డ భవనాన్ని పూర్తిగా తొలగించి అక్కడ నూతన భవనం ఏర్పాటు చేసి మరుగుదొడ్లను బాగు చేయాలని స్థానిక సర్పంచ్ కోన పైడిరాజు శ్రీనివాసరావు తెలిపారు. అలాగే పాఠశాలకు వెళ్లే రహదారి పూర్తి దుర్భల పరిస్థితి లాగా ఉండడంతో విద్యార్థుల ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో బురద నీటిలో రాకపోకలు సాగించడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఇదే విషయంపై మండల సర్వసభ్య సమావేశంలో ఫిర్యాదు మండల అధికారికి చేశామని వెంటనే చొరవ తీసుకొని పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను కోరారు.

11న స్టీల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సీపీఎం బహిరంగ సభ

విశాలాంధ్ర - పెందుర్తి: ఈఓఐ పేరుతో విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని బీజేపీ, టీడీపీ, జనసేన ప్రభుత్వాలు ఆపాలని, సొంత గనులు కేటాయించాలని, చట్ట విరుద్ధంగా తొలగించిన ఐదువేల మంది కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని తదితర డిమాండ్లతో ఈనెల 11వ తేదీన సీపీఎం ఆధ్వర్యంలో పాతగాజువాకలో నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ గోపాలపట్నం జోన్ కార్యదర్శి బి.జగన్ తెలిపారు. ఈ సభకు సిపిఎం అఖిలభారత ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ ఎంఏ బేబీ, రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ వి.శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. ఈ మేరకు చిన్నముసిడివాడ ఏరియాలో పాదయాత్ర చేపట్టి స్టీల్‌ప్లాంట్ రక్షించాలని, విద్యుత్ స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని ప్రచారం నిర్వహించారు. ఈ పాదయాత్రలో జోన్ నాయకులు జి.శంకర్, కె.అప్పలనాయుడు, ప్రభు ఈశ్వరరావు, ముత్యాలమ్మ, రాజు మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస: ఈఓఐ పేరుతో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ఆపాలని, అదానీ, విద్యుత్ ప్రీ పెయిడ్, స్మార్ట్ మీటర్లు బిగించవద్దు అని డిమాండ్ చేస్తూ ఈనెల 11వ తేదీ సాయంత్రం 5 గంటలకు పాత గాజువాకలో జరుగు భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఎం భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యంలో స్థానికంగా ఆదివారం సాయంత్రం భారీ ర్యాలీ, స్థానిక జంక్షన్లో సభ నిర్వహించారు. చిట్టివలస ఫుట్‌బాల్ గ్రౌండ్ వద్ద ప్రారంభమైన ర్యాలీ జ్యూట్ కార్మికవాడ, జంక్షన్, మెయిన్ రోడ్డు మీదుగా ప్రైవేట్ మార్కెట్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ విశాఖ అభివృద్ధి ప్రభుత్వ రంగసంస్థలతో ముడిపడి వుందని, విశాఖ పోర్టు ఏర్పాటుతో ప్రభుత్వ రంగ పరిశ్రమలు ఒక్కొక్కటిగా ఏర్పాటయ్యాయన్నారు. ఈఓఐ పేరుతో కేంద్రంలోని బిజెపి నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అమ్మేయాలని కుట్ర చేస్తుందని అన్నారు. విశాఖ ఉక్కును, ఉపాధిని, అభివృద్ధిని రక్షించాలని కోరుతూ సీపీఎం జిల్లా కమిటీ అధ్వర్యంలో సెప్టెంబర్ 11 వరకు నిర్వహించనున్న ప్రచారంలో ప్రజలు, అన్ని రంగాల కార్మికులు భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం భీమిలి జోన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎస్ఎన్ మూర్తి, ఎస్.అప్పల నాయుడు, ఆటో, ముఠా తదితర రంగాల కార్మికులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాలు నిరసన తెలిపాలి



విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: పార్లమెంట్‌లో ఈనెల 9న ఉపరాష్ట్రపతి ఎన్నికలు జరుగుతున్న సందర్భంగా 8వ తారీఖున ఢిల్లీకి వినిపించేలా స్టీల్ ప్లాంట్ కార్మిక సంఘాలు భారీ నిరసన కార్యక్రమాలు చేపట్టాలని,ఆంధ్ర ఎంపీ లకు తమ నిరసన వ్యక్తం చేయాలని కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ ఇంచార్జ్ ప్రియాంక దండి పిలుపునిచ్చారు. ఆంధ్ర ఎంపీలు ఎన్‌డిఎ అభ్యర్థికి వ్యతిరేకంగా ఓటు వేయాలని కార్మిక సంఘాలు పిలుపునివ్వాలని, పెద్ద ఎత్తున నిరసన తెలియజేయడం ద్వారా ఎంపీలకు కేంద్ర ప్రభుత్వానికి ఒక హెచ్చరిక పంపించునట్టు అవుతుందని ఆమె అన్నారు. ఎన్ డి ఎ అభ్యర్థి గెలిస్తే బీజేపీకి విశ్వాసం పెరిగిపోతుందని స్టీల్ ప్లాంట్ ప్రైవేటికరణ చేయడానికి రాష్ట్రంలో అన్ని పార్టీలు ఒప్పుకున్నట్టే అవుతుందన్నారు .వచ్చే సర్వత్రిక ఎన్నికల నాటికి స్టీల్ ప్లాంట్ ప్రైవేటికరణ అగిపోతుందని ప్రియాంక అన్నారు. స్టీల్ ప్లాంట్ కార్మిక సంఘాలు ఎన్నికకు ఒక్క రోజు ముందు కథంతొక్కితే మన ఎంపీలు ఎన్ డి ఎ అభ్యర్థికి ఓటు వేయడానికి భయపడతారని ఆమె అన్నారు.

13న విజయవాడలో సదస్సును జయప్రదం చేయండి

విశాలాంధ్ర - తగరపువలస: కనీస ఫించను పెంపు, డిఎ, రైల్వేలో రాయితి పునరుద్ధరణ, తదితర సమస్యల పరిష్కారం కొరకు గత 12సంవత్సరాలుగా అనేక రకాల పోరాట కార్యక్రమాలు చేస్తున్నప్పటికి కేంద్రంలోని మోడి ప్రభుత్వం మన సమస్యలు పరిష్కారం చేయాలని ఆలోచన కూడా చేయలేదని, ప్రస్తుత పరిస్థితులలో కేంద్ర కమిటి ఆలోచించి దేశంలో ఉన్న అన్ని కలెక్టర్ ఆఫీసుల వద్ద ఆగష్టు 25 వతేదిన నిరసన తెలియజేసి కలెక్టర్‌కి వినతి పత్రాలు ఇవ్వాలని, సెప్టెంబర్ 13వ

తేదీన దేశంలోని అన్ని రాష్ట్రాలలో సదస్సులు నిర్వహించాలని పిలుపునిచ్చినట్టు చిట్టివలస పింఛన్‌దారుల సంఘం సభ్యులు తెలిపారు. డిశంబరులో ఢిల్లీలో పెద్ద ఎత్తున ధర్నాలు చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. దానిలో భాగంగా రాష్ట్ర కమిటి విజయవాడ లో సదస్సు నిర్వహించాలని నిర్ణయించినట్టు, విశాఖ కలెక్టర్ ఆఫ్సు వద్ద జరిగిన నిరసన కార్యక్రమానికి చిట్టివలస నుండి 20 మంది వెళ్ళామని తెలిపారు. 13వ తేదీన విజయవాడ సదస్సుకు 10 మంది బయలుదేరుతున్నట్టు తెలిపారు.

అన్నదాత పోరుకు సిద్ధం కండి : చిన్న శ్రీను

విశాలాంధ్ర పద్మనాభం: పద్మనాభం మండలం వైఎస్ఆర్సిపి మండల కార్యాలయంలో భీమిలి వైసిపి సమన్వయకర్త చిన్న శ్రీను ఈనెల ఆర్డీవో ఆఫీస్ ఎదుట జరగబోయే అన్నదాత పోరు కార్యక్రమానికి అందరూ హాజరవ్వాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అన్ని రంగాల్లోనూ అన్ని వ్యవస్థలలోనూ నిర్వీర్యం చేస్తూ సాధారణ పౌరులకు నిరుపేదలకు రైతులకు విద్యార్థులకు ఉద్యోగులకు కార్మికులకు ఏ విధమైన న్యాయం చేయకపోగా తిరిగి వాలిపాటి శాపం గా మారిందని అన్నారు. గత వైసిపి ప్రభుత్వం హయాంలో రైతుల కొరకు ఆర్బికెలు ఏర్పాటు చేయడం జరిగిందని సకాలంలోని ఎరువులు మందులు విత్తనాలు అందుబాటులో ఉండేవని రైతులు ఎటువంటి ఇబ్బంది పడకుండా పంటలు పండించే వారిని అన్నారు. ఇప్పుడు దానికి భిన్నంగా రైతు సేవ కేంద్రాలుగా పేర్లు మార్చి రైతులకు అందాల్సిన ఎరువులు విత్తనాలు వంటివి బ్లాక్ మార్కెట్కు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని రైతులు కు జరుగుతున్న అన్యాయంపై ఈనెల తొమ్మిదో తారీఖున భీమిలి ఆర్డిఓ కార్యాలయం ఎదుట రైతు పోరుకు అన్ని వర్గాలు వారు వైసిపి పార్టీ శ్రేణులు నాయకులు కార్యకర్తలు ఇతర అనుబంధ సంఘ వైసీపీ నాయకులు రైతులకు న్యాయం జరిగేలా అన్నదాత పోరుకు రావాలని మద్దతు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ నాయకులు ఎంపీపీ రాంబాబు జిల్లా వైస్ చైర్మన్ ఎస్ గిరిబాబు పార్టీ మండల అధ్యక్షుడు కే లక్ష్మణరావు ఇతర మండలాల నుంచి వచ్చిన నాయకులు కార్యకర్తలు వైసీపీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు

ఘనంగా జిప్సా ఉపాధ్యాయ దినోత్సవం

విశాలాంధ్ర - పెదగంట్యాడ: గాజువాక ప్రైవేట్ పాఠశాలల సంఘం (జిప్సా) ఆధ్వర్యంలో పాత గాజువాక బెస్ట్ వెస్టన్ రామచంద్ర హెూటల్‌లో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిధులుగా ఉత్తరాంధ్ర పట్టభద్రుల మరియు ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు వేపాడ చిరంజీవిరావు, గాదె శ్రీనివాసులు నాయుడు, పాఠశాల విద్య ప్రాంతీయ సంచాలకులు బి.విజయ భాస్కర్‌లు పాల్గొన్నారు. అతిధులు ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్ర పటానికి పూల మాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. చిరంజీవిరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు ప్రభుత్వ, ప్రైవేట్ అనే తారతమ్యం లేకుండా విలువలుతో కూడిన బోధన చెయ్యాలని, రాధాకృష్ణ జీవితంను ఆదర్శంగా తీసుకొని నవ సమాజ నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ అన్నీ వృత్తులవారిని తయారు చేసేది ఉపాధ్యాయ వృత్తి అని, అందుకనే సమాజంలో ఉపాధ్యాయుడికి వున్న గౌరవం ఇంకెవ్వరికి లేదని, కనుక బాధ్యతగా మెలగాలని సూచించారు. విజయభాస్కర్ మాట్లాడుతూ దేశ భవిష్యత్‌ని నిర్మించే మన తర్వాత తరంను తయారు చేసే బాధ్యత ఉపాధ్యాయుడుదేనని కనుక సత్ప్రవర్తన కలిగి, విద్యార్థులకు ఆదర్శవంతంగా నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం ఉపాధ్యాయ వృత్తి లో వుంటూ జిప్సాకి సేవలందిస్తున్న సీనియర్ సభ్యులను అతిధుల చేతులు మీదుగా ఘనంగా సన్మానించారు. ముందుగా జిప్సా ఆవిర్భావం 2001 నుండి నేటి వరకు సహాయ కార్యదర్శిగా, కోశాధికారిగా, రెండు సార్లు ప్రధాన కార్యదర్శి గా, మూడు మార్లు అధ్యక్షునికి గా, ప్రస్తుతం గౌరవ అధ్యక్షునిగా సేవలందిస్తున్న భాస్కర్ విద్యా నికేతన్ స్కూల్ డైరెక్టర్ పాలవలస భాస్కరరావుకి, తర్వాత అనేక ఏళ్ళుగా కార్యవర్గ సభ్యులుగా సేవలందిస్తున్న బాల జ్యోతి స్కూల్ కరెస్పాండెంట్ పెద్ద పెంకి ప్రసాదరావుకు, శ్రీ సాయి విద్యానికేతన్ నాగుల రవికుమార్‌కు, ఎక్సలెంట్ స్కూల్ చుండూరు సత్యలకు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విశిష్ట అతిధులు గా గాజువాక, పెద్ద గంట్యాడ మండల ఎంఈఓలు సునీత, రమణాజీలు పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి జిప్సా అధ్యక్షుడు బి.శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా కార్యదర్శి యస్.షణ్ముఖ రావు, కోశాధికారి ఎం.బాబురావు, సలహాదారులు యమ్ జగ్గారావు, మురళీ సుందర్, శ్రీధర్, జగన్ పాల్గొన్నారు.

మూత్రపిండాల విషయంలో జాగ్రత్త వహించాలి

విశాలాంధ్ర - విశాఖపట్నం: మూత్రపిండాలు శరీరంలోని ముఖ్యమైన అవయవాలలో ఒకటని, ఇవి అనేక ముఖ్యమైన విధులను నిర్వహిస్తాయని, వీటిలో వ్యర్థ ఉత్పత్తులు, అదనపు ద్రవాన్ని తొలగించడం, రక్తంలో నీరు మరియు ఖనిజాలను సమతుల్యం చేయడం, రక్తపోటును నియంత్రించడం మరియు ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి సహాయపడటం ఇంతకీ కీలకంగా ఉన్న మూత్రపిండాల ఆరోగ్య విషయంలో చాలా జాగ్రత్త వహించాలని లయన్స్ క్యాన్సర్ జనరల్ ఆసుపత్రి మేనేజింగ్ ట్రస్టీ ఆచార్య వి.ఉమామహేశ్వరరావు అన్నారు. మూత్రపిండాలు శరీరం నుండి విషాన్ని వ్యర్థాలను తొలగించే సామర్థ్యాన్ని కోల్పోయినప్పుడు, అది మూత్రపిండాల వైఫల్యానికి దారితీస్తుంది. నేషనల్ కిడ్నీ ఫౌండేషన్ ప్రకారం, మూత్రపిండాలలో 85-90 శాతం సాధారణంగా పనిచేయనప్పుడు, మూత్రపిండాల వైఫల్యం ఉందని అర్థం అని చెప్పారు. మూత్రపిండాల్లో రాళ్లు, విస్తరించిన ప్రోస్టేట్, మూత్ర నాళంలో రక్తం గడ్డకట్టడం, మూత్రాశయాన్ని నియంత్రించే దెబ్బతిన్న నరాలు. మూత్రపిండాలకు తక్కువ రక్త ప్రవాహం, భారీ లోహాల వల్ల కలిగే విషపదార్థాల ఓవర్‌లోడ్, ఇన్ఫెక్షన్, మూత్రపిండాలలో, చుట్టూ రక్తం గడ్డకట్టడం, మల్టిపుల్ మైలోమా, లూపస్ ఇవన్నీ కూడా మూత్రపిండా వైఫల్యాలకు కారణాలుగా చెప్పారు. మొదటి దశలో ఎటువంటి లక్షణాలను మరియు సమస్యలను అనుభవించలేరని, రెండవ దశలో శారీరక నష్టం ఎక్కువ ఉంటుందని, మూడు నాలుగు దశలలో పలు రకాల సమస్యలు ఉత్పన్నమవుతాయని తెలిపారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని నిర్వహించడం ద్వారా మూత్రపిండ వైఫల్యాన్ని నిర్వహించవచ్చు అన్నారు. ఖచ్చితమైన నిర్ధారణ మరియు తగిన సలహా కోసం వైద్యుడిని (నెఫ్రాలజిస్ట్) సంప్రదించడం ముఖ్యం అని సూచించారు.

24 గంటల్లో 1,63,254 సైన్ అప్‌లతో ఏపీ గిన్నిస్ వరల్డ్ రికార్డ్

విశాలాంధ్ర - విశాఖపట్నం: స్టార్టప్‌లను ప్రోత్సహించడంలో, కింది స్థాయిలో ఉన్నటువంటి వ్యవస్థాపకతను ప్రోత్సహించడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలకమైన ముందడుగు వేసింది. ఆంధ్రప్రదేశ్ ఇన్నోవేషన్ సొసైటీ (ఏపీఐఎస్) ఆగస్టు 19న మధ్యాహ్నం 12:30 గంటల నుండి ఆగస్టు 20న మధ్యాహ్నం 12:30 గంటల మధ్య 1,63,254 సైనప్ రిజిస్ట్రేషన్లను సాధించింది. కేవలం 24 గంటల్లోనే అత్యధిక ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ / స్టార్టప్ / బిజినెస్ ప్రోగ్రామ్‌కు ఆన్‌లైన్‌లో సైన్ అప్ చేసినందుకు గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌ను సృష్టించిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు, గృహిణులు, ఆవిష్కర్తలు, యువత ఆవిష్కరణ మరియు వ్యవస్థాపక ఆలోచనలను ప్రోత్సహించే లక్ష్యంతో చేపట్టిన 'అవిష్కరణ ఆంధ్ర' కింద ఈ రికార్డును సృష్టించారు. ఈ కార్యక్రమం ద్వారా అట్టడుగు స్థాయిలో ఉన్న స్టార్టప్ సంస్కృతిని పెంపొందించడం మరియు ఉద్యోగ సృష్టి, ఆర్థిక వృద్ధిని ప్రేరేపించడానికి రూపొందించబడిందన్నారు. గిన్నిస్ అధికారిక న్యాయనిర్ణేత రిషి నాథ్, రికార్డ్ అమలు చేయడానికి నాయకత్వం వహించిన గిన్నిస్ వరల్డ్ రికార్డ్ వ్యూహకర్త నిశ్చల్ బారోట్ ఈ కార్యక్రమంలో ఉన్నారన్నారు. ఇక ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు మరియు ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ సీఈవో సూర్య టీలకు గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సర్టిఫికేట్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, పరిశ్రమలు, ఐటీ మంత్రి నారా లోకేష్ సహా సీనియర్ నాయకులు, పరిశ్రమల ప్రముఖులు పాల్గొన్నారు. రాష్ట్ర భవిష్యత్తుకు వ్యవస్థాపకతను చోదక శక్తిగా ప్రోత్సహించాలనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ దార్శనికతను పాల్గొన్నవారు ప్రశంసించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, గిన్నిస్ వరల్డ్ రికార్డ్ విజయాన్ని ఆంధ్రప్రదేశ్ స్టార్టప్ పర్యావరణ వ్యవస్థకు ఒక మైలురాయిగా అభివర్ణించారు. "ఒక కుటుంబం, ఒక వ్యవస్థాపకుడు" అనే తన ప్రభుత్వ లక్ష్యాన్ని పునరుద్ఘాటించారు. భారతదేశం అంతటా వివిధ రాష్ట్ర ప్రభుత్వాలకు 63 గిన్నిస్ వరల్డ్ రికార్డ్ ప్రయత్నాలను పర్యవేక్షించిన నిశ్చల్ బరోట్, ఈ రికార్డు కోసం వ్యూహాత్మక ప్రణాళిక, ధృవీకరణ ప్రక్రియ మరియు ధృవీకరణ విధానాలకు బాధ్యత వహించారు.

మోటరోలా, స్వరోవ్స్కితో భాగస్వామ్యంలో బ్రిలియంట్ కలెక్షన్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - విశాఖపట్నం: మొబైల్ ఆవిష్కరణలో ప్రపంచ నాయకుడు, భారతదేశంలోని ప్రముఖ ఏఐ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ మోటరోలా, సాంకేతికత, ఆభరణాల సమ్మేళనాన్ని పునర్నిర్వచించే స్వరోవ్స్కితో ప్రత్యేక సహకారంలో బ్రిలియంట్ కలెక్షన్ను ప్రారంభించినట్లు ప్రకటించింది. ఈ సేకరణలో మోటోరోలా రాజర్ 60 మోటో బడ్స్ లూప్ స్వరోవ్స్కి ఎడిషన్ను ఒకచోట చేర్చింది. ఇది ఖచ్చితమైన హస్తకళ, అత్యాధునిక ఆవిష్కరణ మరియు కాలాతీత చక్కదనంను విలీనం చేస్తూ వినియోగదారులకు ప్రకాశించే పరికరాలను అందిస్తుంది. మోటరోలా మరియు స్వరోవ్స్కి ఆవిష్కరణ, హస్తకళ మరియు ఐకానిక్ వారసత్వంలో లోతుగా పాతుకుపోయిన అభిరుచిని పంచుకుంటూ, వినియోగదారుల పెరుగుతున్న ధోరణికి ప్రతిస్పందిస్తాయి. ఇవి వినియోగదారులు పరిపూర్ణత మాత్రమే కాకుండా వ్యక్తిగత శైలిని పెంపొందించే సాంకేతిక పరిజ్ఞానంను కోరుతున్నందుకు సంబంధించిన భాగస్వామ్యం. బ్రిలియంట్ కలెక్షన్ ద్వారా, మోటరోలా తన లైఫ్‌స్టైల్ టెక్ బ్రాండ్‌గా దృష్టిని బలోపేతం చేస్తూ, ఫ్యాషన్ మరియు కార్యాచరణను సజావుగా మిళితం చేస్తుంది, తద్వారా వినియోగదారులు చక్కదనం మరియు అధునాతన సాంకేతిక పరిజ్ఞానం మధ్య రాజీ పడాల్సిన అవసరం లేకుండా ప్రత్యేక అనుభవాన్ని పొందగలుగుతారు. మోటోరోలా రాజర్ 60 స్వరోవ్స్కి ఎడిషన్ ఐకానిక్ ఫ్లిప్ ఫోన్ను నిజమైన ఫ్యాషన్ కళాఖండంగా మార్చి లగ్జరీని పునర్నిర్వచిస్తుంది. అద్వితీయమైన పాంటోన్ ఆర్ ఐస్ మెల్ట్ షేడ్లో మెరిసే క్విల్టెడ్ లెదర్-ప్రేరేపిత ముగింపు, ప్రతి చూపులో అధునాతనతను ప్రతిబింబిస్తుంది.

19 నుండి ఇన్‌స్టామార్ట్ క్విక్ ఇండియా మూవ్‌మెంట్

విశాలాంధ్ర - విశాఖపట్నం: షాపింగ్ పరంగా సౌలభ్యంకు సంబంధించిన అపూర్వమైన వేడుకలో భాగంగా భారతదేశపు మార్గదర్శక త్వరిత వాణిజ్య వేదిక అయిన ఇన్‌స్టామార్ట్ ఈరోజు తమ ప్రారంభ వార్షిక మెగా సేల్ , భారతదేశపు అత్యంత వేగవంతమైన అమ్మకం అయిన ' ఇన్‌స్టామార్ట్ క్విక్ ఇండియా మూవ్‌మెంట్ 2025' ను ప్రారంభించినట్లు వెల్లడించింది. ఈ అమ్మకం, కొనుగోలుదారులకు వేగవంతమైన డెలివరీతో పాటుగా ఉత్తేజకరమైన ఆఫర్‌లను సైతం అందిస్తుందని ఆ సంస్థ ప్రతినిధి తెలిపారు. ఇంతకు ముందు ఎన్నడూ లేని విధంగా షాపింగ్ అనుభవాలను సృష్టిస్తోందని, ఈ సేల్ సెప్టెంబర్ 19 నుండి సెప్టెంబర్ 28, 2025 వరకు ఇన్‌స్టామార్ట్ యాప్ మరియు స్విగ్గీ యాప్ రెండింటిలోనూ అందుబాటులో ఉండనుందన్నారు. ఈ సేల్ కాలంలో కస్టమర్లు 50-90 శాతం తగ్గింపుతో భారీ రాయితీలను ఆశించవచ్చు అని, ఎలక్ట్రానిక్స్, కిచెన్ , డైనింగ్, బ్యూటీ , పర్సనల్ కేర్, బొమ్మలు మరియు మరిన్ని విభాగాలలో గణనీయమైన తగ్గింపులను సైతం పొందవచ్చు అన్నారు. ఇవన్నీ కేవలం 10 నిమిషాల్లో డెలివరీ చేయబడతాయి. 50,000 కంటే ఎక్కువ ఉత్పత్తులతో, ఈ సీజన్ యొక్క అతిపెద్ద ఆఫర్‌లకు త్వరిత వాణిజ్యం యొక్క వేగం మరియు సౌలభ్యాన్ని తీసుకురావడం ద్వారా ఇన్‌స్టామార్ట్ పండుగ షాపింగ్‌ను పునరావిష్కరిస్తోందన్నారు. అన్ని యాక్సిస్ బ్యాంక్ క్రెడిట్ కార్డ్‌లతో తక్షణ 10 శాతం తగ్గింపును, వన్ ప్లస్, ఒప్పో, షావోమి, పోకో మరియు రియల్ మీ వంటి ప్రముఖ స్మార్ట్‌ఫోన్‌లపై మరియు బోట్ , జెబిఎల్, ఫిలిప్స్ , రియల్ మీ, గోబౌల్ట్, లైఫ్ లాంగ్ , ను రిపబ్లిక్ , నాయిస్, పోర్ట్రోనిక్స్, మార్షల్ మరియు ఇతరుల నుండి గాడ్జెట్‌లు మరియు ఉపకరణాలపై బ్లాక్‌బస్టర్ డీల్‌లు అందుబాటులో ఉంటాయని చెప్పారు.

నేటితో ముగియనున్న సూత్రా వస్త్ర ప్రదర్శన

విశాలాంధ్ర - విశాఖపట్నం : సంప్రదాయత నుండి ఆధునిక ఫ్యాషన్ దుస్తులు వరకు విభిన్న వస్త్ర సంపదను ఒకేచోట అందించే ఇండియన్ ఫ్యాషన్ ఎగ్జిబిషన్ సూత్రా వస్త్ర ప్రదర్శన సోమవారంతో ముగియనుందని నిర్వాహకులు తెలిపారు. నగరంలోని ఆర్కే బీచ్ నోవాటెల్ హెూటల్ నందు గత కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న ప్రదర్శన నేటితో ఆఖరి రోజు అన్నారు. వస్త్ర ప్రియులు ఈ చివరి అవకాశం వినియోగించు కోవలసినదిగా కోరారు. రాబోయే దసరా మరియు దీపావళి పండుగలకు అద్భుతమైన దుస్తులను కొనుగోలు చేసి పండుగలను అత్యంత సంతోషభరితంగా జరుపుకునే సదవకాశం ఈ ప్రదర్శన అందిస్తుంది అన్నారు. దేశం నలుమూలలు నుండి తెచ్చిన అద్వితీయమైన వస్త్రాలు మరియు ఆభరణాలు ఈ పండుగ సీజన్‌ను మరింత శోభాయమానం చేస్తాయన్నారు. ఈ అద్భుతమైన ప్రదర్శనలో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన పేరొందిన వస్త్రాలు, సిల్వర్ జ్యూయలరీ, ప్రముఖ సంస్థల ఉపకరణాలు, అలంకరణ సామగ్రి, క్లాతింగ్ ప్యాలెట్, ఆడా క్రియేషన్స్, లడక్ సిల్క్ శారీస్, ఇంకా ఎన్నెన్నో విస్తృత శ్రేణిలో ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉంచామన్నారు. ఈ ప్రదర్శన ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటలు వరకు సందర్శకులకు తెరచి ఉంటుందని, ప్రవేశం ఉచితం అని చెప్పారు.